పేదల అభ్యున్నతికి కృషి చేస్తా

● మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ : మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్/మాగ నూరు, జూన్ 19 : రాష్ట్రంలో పేదోడి కలను సహకారం చేసి పేదల అభ్యున్నతి కోసం పని చేసేదే కాంగ్రెస్ ప్రభుత్వామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం బీమా ఫేస్‌వన్‌లోని స్టేజ్ టు కంపాస్ నుంచి తిరుమలయ్య చెరువుకు నీరు వెళ్లే పాటు కాలువను మంత్రి పరిశీలించారు. అనంతరం నియోజకవర్గంలోని నర్వ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి ప్రతి చెరువు నింపి సాగుకు నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని నర్వ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని రెండు రిజర్వాయర్లను కృష్ణ నీటితో నింపి రిజర్వాయర్ ఆయకట్టు రైతాంగానికి సాగునీరును సకాలంలో అందించేందుకు చర్యలు చేపడతారని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా మాగనూరు మండల కేంద్రంలో రైతు వేదికలో మాగ నూర్, కృష్ణ ఉమ్మడి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లను మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాగనూర్ మండలానికి 201, కృష్ణ మండలానికి 184 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శైలేశ్, హౌసింగ్ పీడీ శంకర్, డీఈ హరికృష్ణ, తాసీల్దార్ మల్లారెడ్డి, తాసీల్దార్ నాగలక్ష్మి, కృష్ణ మండల ఎంపీడీవో జానయ్య, ఎంపీవో విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ శంకర్‌నాయక్, డీఈ హరి కృష్ణ ఏఈ ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 19 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని కోటకదిర గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. జిల్లాలో కలెక్టర్ విజయేందిర బోయి, ప్రజా ప్రతినిధులు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతోపాటు వినయం, విధేయత, సంస్కారం, మానవతా విలువలను కూడా నేర్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, దాని వల్ల విద్య ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి తనిఖీ

రోగులతో మట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

మరికల్/ఊట్కూర్, జూన్ 19 : ఊట్కూర్ మండలం పులిమామిడి, మరికల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం నారాయణ పేట జిల్లా వైద్యాధికారి జయచంద్ర మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నం దున డాక్టర్లు ఆరోగ్య కేంద్రాల్లో సరైన మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. దవాఖానలో చికిత్సలు ఎలా అందుతున్నాయని రోగులను ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్రరెడ్డితో పాటు వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగులో రైతుల భాగస్వామ్యం

సమావేశంలో మాట్లాడుతున్న పట్ల ప్రభాకర్‌రెడ్డి

బాలానగర్, జూన్ 19 : వాణిజ్య పంటలను సాగుచేయడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్రం వినూత్న పథకాన్ని రూపొందించిందని నాబార్డ్ డీడీఎం షణ్ముఖాచారి అన్నారు. గురువారం బాలానగర్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలానగర్ సింగిల్‌విండో అధ్యక్షుడు పట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మర్ ప్రొడక్టు ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడు సొసైటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీఏసీఎస్ సభ్యత్వంతో నిమిత్తం లేకుండా ఏడు వందల మంది రైతులతో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని, ఒక్కో రైతు రూ.2వేలు చెల్లించి సభ్యుడుగా చేరాల్సి ఉంటుందన్నారు. అలా రైతుల నుంచి సేకరించిన సొమ్ము రూ.15లక్షలకు కేంద్రం రూ.15లక్షలు జత చేస్తుందని తెలిపారు. ఆ సొమ్ము పెట్టుబడిగా గ్రామాల్లోని రైతులతో ఆర్గానిక్ విధానంలో వివిధ రకాల వాణిజ్య పంటలను సాగుచేయిస్తుందని తెలిపారు. జడ్చర్ల సెంట్రల్ బ్యాంక్ మేనేజర్, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

నేడు 'ఉల్లాస్'పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 19: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్‌మెన్లను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లా టాస్ కోఆర్డినేటర్ శివయ్య కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'నవ భారత్ సాక్షరతా కార్యక్రమం'ఉల్లాస్' చేపట్టడం జరిగిందన్నారు. మండలాల వారీగా అక్షరాస్యతా లక్ష్యాలను నిర్దేశించి, అంగన్‌వాడీ, సామాజిక భవనాల్లో వీవో ఏలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ద్వారా వలంటీర్ టీచర్లను, నేర్చుకునే వారిని గుర్తించాలన్నారు. 'ఉల్లాస్' యాప్ న్యూ ఇండియా లిట్రసీ ప్రోగ్రాంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటి విడతలో 64,647 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈనెల 20వ తేదీన జిల్లా స్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఓ టీచర్, డీఆర్‌డీఏ నుంచి ఏపీఎం, కంప్యూటర్ ఆపరేటర్ ప్రతి మండలం నుంచి హాజరుకానున్నారని తెలిపారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నవాబ్‌పేట, జూన్ 19 : మండలంలోని మరికల్ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. 3 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య తోపాటు నాణ్యమైన భోజనం అందించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8886046672 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మెరుగైన విద్యను అందించాలి

● కలెక్టర్ విజయేందిర బోయి

పునరావాస పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), జూన్ 19 : ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఉపాధ్యాయులకు ఆదేశించారు. గురువారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తెలుగు, గణితం, ఆంగ్లం పాఠ్యాంశాలలోని వివిధ సామర్థ్యాలను ఉద్దేశించి విద్యార్థులను ప్రశ్నించి జవాబులు రాబట్టారు. పాఠశాలకు తరగతి గదుల కొరత, మూత్రశాలల సమస్యలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల ప్రాంతంలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ఉన్నత పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న భవనంతోపాటు మిగితా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ఉదయ్‌భాస్కర్, సీఆర్‌పీలు ప్రవీణ్, విజయసింహా, గ్రామస్తులు పాల్గొన్నారు.

పునరావాస పనులు పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 19 : ప్రాజెక్టుల పునరావాస (ఆర్‌అండ్‌ఆర్) పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయిసంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వేల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ కింద కేటాయించే స్థలాన్ని అన్ని వసతులతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపుల్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టితండా, చిన్నగుట్టతండా, శామగడ్డతండా, ఒంటిగుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కల్పించాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్, అంగన్‌వాడీ స్కూల్, ఫంక్షన్ హాల్ వంటి ఇతర మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తయ్యేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మెహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ (ఎల్ఏ) మధుసూదన్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వేల్యాండ్‌రికార్డ్స్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు

దరఖాస్తు చేసుకోండి

నారాయణపేట, జూన్ 19 : తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్, బంజారా హిల్స్, హైదరాబాద్‌లో 2025-26 సంవత్సరానికి నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్ మరియు మెయిన్స్ ఉచిత శిక్షణకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు వెబ్‌సైట్ http://tsstudycircle.co.inలో వచ్చే నెల జూలై 7లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఉమాపతి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించడం ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. అభ్యర్థులు జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీలో ఉత్తీర్ణులై, వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదన్నారు. ప్రవేశపరీక్ష జూలై 13న ఉంటుందని, ఆ పరీక్షలో అభ్యర్థులకు వచ్చిన మార్కులా మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో ఎస్సీలకు 75శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీలకు 15శాతం ప్రకారంగా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అమ్మాయిలకు 33.33% సీట్లు రిజర్వ్ అయి ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్, బంజారా హిల్స్‌లో పది నెలలపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో సివిల్స్ సైతం శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు http://tsstudycircle.co.in నోటిఫికేషన్‌ను చూడాలని, ఇతర సమాచారానికి 040-23546552, 8121626423 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆక్రమణదారులకే అధికారుల మద్దతు

కోస్గి, జూన్ 19 : కోస్గి బస్టాండ్ ఆవరణలో అక్రమంగా వెలుస్తున్న డబ్బాలకు అధికారులు జైకొడుతున్నారు. బస్సులు వచ్చిపోయే దారిలో రోడ్డుకు అనుకొని అక్రమంగా వేస్తున్న ఓ వ్యాపార స్థలాన్ని అడ్డుకోకుండా వారికే ఆర్టీసీ అధికారులు మద్దతు తెలపడం విమర్శలకు దారి తీస్తుంది. అక్రమ నిర్మాణదారులు కూడా ఎవరైతే మాకేంటి అన్నట్లు తమ నిర్మాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. అక్కడ డబ్బాలు వేయడం పూర్తయితే బస్సులు రివర్స్ తీయడంలో డ్రైవర్లకు ఇబ్బందిగా మారుతుంది. ఇంతా జరుగుతున్న డిపో మేనేజర్‌కు కనపడకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు జరుగుతున్న అక్రమాలను ఆపి ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.

విజయవంతం చేయాలి

నారాయణపేట, జూన్ 19 : ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు బాలకేంద్రంలో ఎస్సీ బాలసుబ్రహ్మణ్యం ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మహిపాల్‌రెడ్డి, వసంతకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సరస్వతిమాత, సంగీత వాయిద్యాల పరికరాల పూజ కార్యక్రమం ఉంటుందని ఉంటుందని పేర్కొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయాలి

మక్తల్, జూన్ 19 : మక్తల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు బుధవారం మండల విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై వారం అవుతున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తి, గదులే దర్శనమిస్తున్నాయన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదరణ పెరుగుతున్నప్పటికీ, అదనపు గదులు, డైనింగ్ హాల్, మూత్రశాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నవీన్, నిఖిల్, సాయిరాం, సందీప్, నాని, నిహాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జడ్చర్ల(రాజాపూర్), జూన్ 19 : రాజాపూర్ మండలం మల్లెపల్లికి చెందిన అల్లె బుగ్గమ్మ(87) అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ అభిమాన్యరెడ్డి ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతురాలి అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేయించారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, శ్రీశైలం ఉన్నారు.

పరిశోధన ఫలితాలు సమాజానికి ఉపయోగపడాలి

● పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ శ్రీనివాస్

డాక్టర్ గాలెన్న సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, బోధన, బోధనేతర సిబ్బంది

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 19 : పరిశోధ ఫలితాలు సమాజానికి ఉపయోగపడాలని పాలమూరు వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో సామాజిక శాస్త్ర విభాగం అధ్యాపకుడిగా, బాయ్స్ హాస్టల్ వార్డెన్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మాసినపల్లి గాలెన్న డాక్టరేట్ అందుకున్న సందర్భంగా గురువారం ఆయనను అడ్మిన్ భవనంలో వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రైతే రాజు కావాలి.. రైతుల ఆత్మహత్యలు నివారించడంలో ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. పీహెచ్‌డీ అవార్డు గ్రహీత డాక్టర్ గాలెన్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రైతుల ఆత్మహత్యలపై ప్రొఫెసర్ హన్నా ఆనంద్‌రాజు, డాక్టర్ బీనవేణి రామ్‌షెఫర్డ్ పర్యవేక్షణలో పరిశోధ పూర్తి చేయడంతో ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసిందన్నారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేశ్‌బాబు, పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, పీయూ పీఆర్వో డాక్టర్ శేకుంటి రవికుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద చెరువు విస్తీర్ణం పెంచేందుకు కొలతలు

ఊట్కూర్, జూన్ 19 : నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ఊట్కూర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువుకు విస్తీర్ణం చేసేందుకు గురువారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు భూసేకరణ సర్వే నిర్వహించారు. ఊట్కూర్ పెద్ద చెరువు నుంచి సంప్ హౌస్ ద్వారా నారాయణపేట మండలం జయమ్మ చెరువుకు సాగు నీటిని తరలించే క్రమంలో పెద్దచెరువు విస్తీర్ణం పెంచేందుకు ఊట్కూర్, దంతన్‌పల్లి, లక్ష్మీపల్లి, నిడుగుర్తి, తిప్రాస్ పల్లి, బాపురం రెవెన్యూ శివారులో 312 ఎకరాల్లో భూ సేకరణ ద్వారా చెరువు విస్తీర్ణం చేపట్టేందుకు తాసీల్దార్ రవి ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో భూములు కోల్పోతున్న వారు సన్న, చిన్నకారు రైతులు కావడంతో ఎకరాకు రూ.60లక్షల నుంచి రూ.70లక్షల వరకు పరిహారం అందజేయాలన్నారు. ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రైతులు కొద్ది నెలలుగా డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి మా భూములను ఇవ్వమని రైతులు తెగేసి చెబుతున్నారు. ఇలాంటి సమయంలో రైతుల నుంచి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తుగా భారీ పోలీసు బందోబస్తుతో భూసేకరణ సర్వే నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు కృష్ణారెడ్డి, వెంకటేశ్, ఎస్సై రమేశ్, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని నిరసన

హన్వాడ, జూన్ 19 : హన్వాడ నుంచి దొర్రితండా వరకు వేస్తున్న రోడ్డును పూర్తి చేయాలని తండా వాసులు డిమాండ్ చేశారు. దోరితండా నుంచి హన్వాడ వరకు మూడు కిలోమీటర్లు ఉండగా కేవలం రెండున్నర కిలో మీటర్లు మాత్రమే వేస్తామని కాంట్రాక్టర్ చెప్పడంతో గురువారం తండావాసులు రోడ్డుపై నిరసన చేపట్టారు. మిగతాది కూడా వేయాలని కాంట్రాక్టర్‌ని గ్రామస్తులు కోరగా నిధులు ఉన్న వరకే రోడ్డు వేస్తానని చెప్పారని అన్నారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మిగతా రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దోరితండా ప్రజలు పాల్గొన్నారు.

దొర్రితండా రోడ్డుపై నిరసన చేపట్టిన తండావాసులు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తాసీల్దార్ శ్రీనివాస్

నవాబ్‌పేట, జూన్ 19 : మండలంలో ఈనెల 3వ తేదీన ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగిశాయి. మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామంలో గురువారం రెవెన్యూ అధికారులు చివరి సదస్సును నిర్వహించారు. యన్మన్‌గండ్లలో రికార్డు స్థాయిలో 54 దరఖాస్తులు వచ్చినట్లు తాసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కాగా మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 391 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వివరించారు. వచ్చిన దరఖాస్తులను దశల వారీగా పరిష్కరిస్తామని తాసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్, ఉప తాసీల్దార్ సువర్ణ, ఆర్ఐ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సుష్మ, నాయకులు పాల్గొన్నారు.

డయాలసీస్ సేవలు వినియోగించుకోవాలి

మహబూబ్‌నగర్ , జూన్ 19: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలోని డయాలసీస్ రోగులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం దవాఖానలోని డయాలసిస్ యూనిట్‌లోని రోగులకు ఆపెక్స్ సెంటర్ వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరిటెండెంట్ మాట్లాడుతూ దవాఖానలో త్వరలో నెఫ్రాలజీ యూనిట్ కూడా మొదలవుతుందని తెలిపారు.

ఆపెక్స్ సెంటర్ నుంచి వచ్చిన హెల్త్ ఎడ్యూకేటర్ రాజశేఖర్ డయాలసిస్ రోగులకు కిడ్నీ సంబంధిత రోగాలపై అవగాహన కల్పించారు. డయాలసిస్ రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

డయేరియాపై అవగాహన ఉండాలి

మాగనూరు, జూన్ 19 : డయోరియా వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మాగనూరు కృష్ణ ఉమ్మడి మండలాల డాక్టర్ అప్రోజ్ అన్నారు. గురువారం మాకనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డయోరియా వ్యాధులపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వానకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఏర్పడి ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటారని కావున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ముఖ్యంగా అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు అనంతరం ఎంపీడీవో రహమతులతో కలిపి డయేరియా పై అవగాహన కొరకు గోడపత్రిక విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రహమతుద్దీన్, ఎంఈవో మురళీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కమలమ్మకు మాజీ మంత్రి ఘన నివాళి

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

భూత్పూర్, జూన్ 19 : మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ మాతృమూర్తి కమలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురువారం కమలమ్మ మృత దేహం వద్ద ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా అంత్యక్రియ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్ వనపర్తి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచులు నారాయణగౌడ్, సత్యనారాయణ, నర్సింహాగౌడ్‌పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిటవరం

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, జూన్ 19 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్య మైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. మొత్తం 78మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, హన్మంతు, ప్రశాంత్, అంజద్, మోసీన్, రషీద్, ర